జాషువ

# నా కథ

వ్యాఖ్య

ఎస్. ఎల్. వి. ఉమామహేశ్వరరావు

ఎమెస్కో

# నా కథ

## ప్రథమ భాగము

# నా కథ

## కుశలప్రశ్నలు

కం. ననుగాంచి పెంచి నాలో
గొనబుం గవనమును, పాదుకొల్పిన తల్లీ!
నను మరచిన నిను మరవను
వినుకొండా! నీకు నా పవిత్ర ప్రణతుల్

గొనము = గుణము, కవనము = కవిత్వం, ప్రణతులు = నమస్సులు

తా॥ ఓ వినుకొండా! నన్ను కని పెంచి, నాలో మంచి గుణాల్ని, కవిత్వ రచనా సామర్థ్యాన్ని నెలకొల్పిన తల్లీ! నువ్వు నన్ను మరిచి పోయినప్పటికీ నేను మాత్రం నిన్ను ఎప్పటికీ మరిచిపోను. తల్లితో సమానమైన నీకు నా పవిత్రమైన నమస్కారాలు.

కం. వీరయకు లింగమాంబకు
గారాల సుతుండ కవిని గంధగజముపై
నూరేగి చరణమున పెం
డారంబు ధరించినాడ నలువురు మెచ్చన్.

గారాల = ముద్దుల, గంధగజము = మదపుటేనుగు, చరణము = కాలు, పెండారము = పాండిత్యానికి గుర్తుగా పాదానికి ధరించే ఆభరణం.

తా॥ వీరయ్య లింగమ్మల ముద్దుల కొడుకును, కవిని. ఏనుగు మీద ఊరేగి నలుగురు నన్ను మెచ్చుకుంటూ ఉండగా కాలికి గండ పెండేరాన్ని తొడిగించుకున్నాను.

శా. క్షేమంబేకద? నీకు నీ సుతులకున్ శ్రీకన్యకాండాళికిన్
రామక్ష్మాపతి పాదముద్రల పవిత్రంబైన నీ కొండకున్
నీ మేల్గోరెడు వాయునందనునకున్ నీ పూర్వమర్యాదలన్
సామర్థ్యంబు వచించు భాస్కరుని జీర్ణ స్వర్ణదుర్గాళికిన్

కన్యకాండాళికి = కన్యకా పరమేశ్వరి అమ్మవారికి, క్ష్మాపతి = రాజు, జీర్ణ = శిథిలము, దుర్గాళి = కోటల వరుస

తా॥ అమ్మా! వినుకొండా! నువ్వు, నీలో నివసించే నీ బిడ్డలు, కన్యకా పరమేశ్వరి అమ్మవారు, ఆ రామచంద్రుని పాదముద్రల పవిత్రమైన నీకొండా, ఎల్లప్పుడు నీ మేలుకోరే ఆంజనేయుడు,

నీ ప్రాచీన వైభవాన్ని, పరాక్రమాన్ని తెలియజేసే విధంగా భాస్కరుడు నిర్మించిన శిథిలావస్థలో ఉన్న స్వర్ణదుర్గాలు క్షేమంగానే ఉన్నాయి కదా!

సీ. టిప్పుసుల్తాను గట్టించిన నట్టింటి మజ్జీదుమణికి సేమమ కదమ్మ?
రామలింగేశ్వరస్వామి సౌధమునందు వెలిగింతురే యఖండమును దినము?
ఆరోగ్యవంతుడే మారుతాత్మజుడు పశ్చిమ దిశావాసి గస్తీజవాను?
ఆగ్రహింపదుగదా అంకాళిదేవత అలతి సత్తులకు పెద్దక్కగారు?
ఆ.వె. తీగబావి పొంత తిష్ఠవేసిన యట్టి
కనకదుర్గ యింటి కడప ద్రొక్కి
తొంగి చూచువారు తొల్లి లేరిపుడైన
పలుకరింతురమ్మ! పౌరజనులు

మజ్జీదుమణి = శ్రేష్ఠమైన మసీదు, సౌధము = భవనం / ఆలయం, అఖండము = ఆలయంలో నిరంతరం వెలిగే దీపం, మారుతాత్మజుడు = హనుమంతుడు, గస్తీజవాను = రక్షకుడు, అలతిసత్తులు = చిన్న చిన్న శక్తులు (గ్రామదేవతలు), పొంత = సమీపం.

తా॥ పట్టణం మధ్యలో టిప్పుసుల్తాను కట్టించిన మసీదు క్షేమంగానే ఉందికదా! రామలింగేశ్వరస్వామి ఆలయంలో రోజూ అఖండ దీపారాధన జరుగుతునే ఉందికదా! పట్టణానికి రక్షకుడుగా పశ్చిమ దిక్కులో ఉన్న హనుమంతుడు అప్పటిలాగా ఆరోగ్యంగానే ఉన్నాడు కదా! చిన్న చిన్న శక్తులైన గ్రామదేవతల పెద్దక్క గారైన అంకాలమ్మ ప్రజలపై కోపగించడంలేదు కదా. తీగబావి దగ్గర తిష్ఠవేసిన కనకదుర్గమ్మ ఇంటి గడప తొక్కడానికి భయపడి అప్పట్లో ఆవైపు తొంగిచూసేవారు కాదు. కనీసం ఇప్పుడైనా ఎవరైనా దుర్గమ్మను పలకరిస్తున్నారా?

ఉ. ఊరికి దూర్పుగా నిలిచియున్న మసీ దొకనాడు నిత్య కే
ళీరతులైన బాలుర కళీకకళా కితవ ప్రజాళికిన్
జారుల కాశ్రయంబయి ప్రశస్తికి నెక్కినదమ్మ! దాని ప్రా
కారపుఱాల్ మసీదనిన కాదని చూపు శివాలయాంకముల్

కేళీరతులు = ఆటల్లో మునిగినవాళ్ళు, కితవప్రజ = దుష్టవర్తనులు, జారులు = విటులు, ప్రాకారము = చుట్టుగోడ, అంకములు = చిహ్నములు, గుర్తులు

తా॥ ఊరికి తూర్పుగా ఉన్న మసీదు పాడుబడి పిల్లలకు ఆటస్థలంగా ఉండేది. రాను రాను దుర్మార్గులకు, విటులకు నిలయమై అనేక పనులకు ఆటపట్టు అయింది. ఆ చుట్టుగోడ రాళ్ళు అది మసీదు అని తెలియజేస్తుంటే, అందులో ఉండే శిథిలాలు ఒకప్పటి శివాలయం ఆనవాళ్ళను చూపిస్తున్నాయి.